# నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 కరీంనగర్, మంగళవారం 23 జనవరి 2024 PEDDAPALLI




రేకుర్తిలోని సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద జాతరకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

## సమ్మక్క జాతరకు ఏర్పాట్లు చేయాలి

ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలి • ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 22: రేకుర్తిలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా ఇబ్బంది రాకుండా చూడాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచించారు. సోమవారం రేకుర్తిలోని శ్రీ కంకాలమ్మ కేతేశ్వర ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో మేదర కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అనంతరం రేకుర్తి గుట్ట సమీపంలో సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకున్నారు. ఫిబ్రవరిలో జరిగే జాతరకు కార్పొరేషన్ ద్వారా చేపట్టే ఏర్పాట్లపై మేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేకుర్తిలోని అమృతేశ్వర ఆలయంలోనూ పూజలు చేశారు. ఆ తర్వాత టవర్‌సర్కిల్ సమీపంలో వాల్మీకి మహర్షి ఆలయాన్ని ప్రారంభించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రేకుర్తిలో సమ్మక్క జాతర అత్యంత వైభవంగా సాగుతున్నదని, భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మరో రెండు మూడు రోజుల్లో జాతర ఏర్పాట్లు ప్రారంభిస్తామన్నారు. ఈ సారి కూడా 5 లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. జాతరకు జిల్లా యంత్రాంగం నుంచి చేయాల్సిన ఏర్పాట్లను ప్రారంభించాలని కలెక్టర్‌ను కోరుతున్నామన్నారు. జాతరకు ఐదు రోజుల ముందు నుంచే కెనాల్ నుంచి నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి దానిపై ఎలాంటి ప్రణాళిక లేదని, త్వరగా సిద్ధం చేయాలని కోరారు. నగరపాలక సంస్థ ద్వారా చేయాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తారని, జిల్లా యంత్రాంగం, పోలీస్, రెవెన్యూ పక్షాన చేయాల్సిన పనులు త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. కార్యక్రమాల్లో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు సుధగోని మాధవి కృష్ణగౌడ్, ఏదుర్ల రాజశేఖర్, నాయకులు వంగల పవన్, పిట్టల శ్రీనివాస్ ఉన్నారు.



ఆలయ ఆవరణలో భక్తులు

## రాజన్న సన్నిధికి అరవై వేలకుపైగా..

వేములవాడ టౌన్, జనవరి 22: రాజన్న క్షేత్రం సోమవారం కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మందితో పోటెత్తింది. ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో ఎటూ చూసినా రద్దీ కనిపించింది. మేడారం జాతరకు వెళ్లేవారు మొదట రాయేశుడిని దర్శించుకోవడం ఆనవాయితీ కాగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేసి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. 3 గంటల పాటు క్యూలో నిల్చొని దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు కోడె మొక్కు తీర్చుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకే సుమారు 60 వేలకు పైగా భక్తులు రాజన్నను దర్శించుకున్నారని, దాదాపు ₹32 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. కాగా ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, ఇన్‌స్పెక్టర్లు సంకెపల్లి పవన్‌కుమార్, చెక్కిళ్ల అశోక్, శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణ

కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి అధికారులు • 'నమస్తే' కథనానికి స్పందన

విద్యానగర్, జనవరి 22: కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన ఏఆర్‌టీ సెంటర్‌లో నిధుల దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలపై కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. దవాఖాన అకౌంట్స్ అన్నింటిని గత నవంబర్ 1న దవాఖాన ప్రస్తుత సూపరింటెండెంట్‌కు గత సూపరింటెండెంట్ అందించారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా అదే నెల 7 తర్వాత చెక్కులు డ్రా చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై 'దవాఖానలో ఆగని లావాదేవీలు' శీర్షికన ఈ నెల 17న నమస్తే తెలంగాణ దిన పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ పమేలా సత్పతి స్పందించి, విచారణ చేపట్టాలని డీఎంహెచ్‌వో లలితాదేవిని ఆదేశించారు.

## అబ్బురపరిచేలా రామాలయం నమూనాలు

రాయికల్, జనవరి 22: శ్రీరామ జన్మస్థలం అయోధ్యలో రామమందిరం నిర్మాణం, బాల రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఇరువురు విద్యార్థులు తమ దైవభక్తిని చాటుకున్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన తాటిపాముల రిషిభాగాధిత్య, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఎంజాల హరిహరన్ అట్ట ముక్కలతో అయోధ్య రామాలయం నమూనాలు తయారు చేశారు. అచ్చం రామాలయాన్ని పోలినట్లు ఆవిష్కరించగా, పలువురు ప్రత్యేకంగా అభినందించారు.



రామాలయ నమూనాలతో రిషిభాగాధిత్య, హరిహరన్

# మాఫియా చేతిలో ఎన్టీపీసీ యాష్ పాండ్?



కుందనపల్లి ఎన్టీపీసీ యాష్ పాండ్‌లో పేరుకుపోయిన బూడిద నిల్వలు

- ఈ నెల 18 నుంచి ఆగిన లారీలు.. నిలిచిన బూడిద తరలింపు
- టెండర్‌దారులు పాండ్‌కు వెళ్లకుండా అడ్డగింత
- స్థానికులకే ట్రాన్స్‌పోర్ట్ అవకాశం ఇవ్వాలనే డిమాండ్
- పేరుకుపోతున్న యాష్ నిల్వలు
- పరిస్థితి ఇలాగే ఉంటే ఎన్టీపీసీకే ప్రమాదం
- ఉమ్మడి జిల్లాలోని ఇటుక బట్టీలపై ప్రభావం
- వ్యవహారం వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉందనే అనుమానాలు
- పోలీసుల తీరుపై విమర్శలు

**ఎన్టీపీసీకి చెందిన యాష్ పాండ్ మాఫియా చేతుల్లోకి వెళ్తున్నదా..? పాండ్‌పై గుత్తాధిపత్యం కోసం పలువురు ప్రయత్నం చేస్తున్నారా..? తాము చెప్పిందే వేదంగా అధిక ధరలకు బూడిద (యాష్)ను అమ్మాలని చూస్తున్నారా..? దీని వెనుక కొంత మంది అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నదా..? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. బూడిదను తరలించాల్సిన లారీలను ఈ నెల 18 నుంచి నిలిపివేయడమే అందుకు నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 400 లారీలు నిలిచిపోవడంతో ఇటుక బట్టీలపై ప్రభావం పడడమే కాదు, పలు జాతీయ రహదారులకు వెళ్లాల్సిన బూడిద ఆగిపోయి పనులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. కొంతమంది నిబంధనల మేరకు యాష్‌ను తీసుకెళ్లే లారీలను బలవంతంగా నిలిపివేసినా.. పోలీసులు చోద్యం చూస్తున్న తీరుపై విమర్శలు వస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే పాండ్‌లో నిల్వలు పేరుకుపోయి ఏకంగా ఎన్టీపీసీ ప్లాంటే మూసివేసే ముప్పున్నది. ఇదే సమయంలో పర్యావరణానికి కూడా ప్రమాదం ఏర్పడనున్నది.**

కరీంనగర్, జనవరి 22 (నమస్తేతెలంగాణప్రతినిధి): ఇటుకలు (బ్రిక్స్), జాతీయ రహదారులు, పలు రకాల పనులకు వాడే మట్టిని తగ్గించడంతోపాటు ఇసుక వినియోగాన్ని నివారించేందుకు బూడిదను వాడాలని కేంద్రం 1999లో జీవోను విడుదల చేసింది. ఆ మేరకు 2001 నుంచి బూడిద వాడకం దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. బొగ్గు ఆధారిత ప్రాజెక్టు అయిన ఎన్టీపీసీలో బొగ్గును మండించిన తర్వాత వచ్చే బూడిద కోసం కుందనపల్లి గ్రామం వద్ద పాండ్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఎన్టీపీసీ నుంచి వచ్చే సుమారు 11వేల టన్నుల బూడిద ఇక్కడే స్టాక్ అవుతున్నది. ప్రస్తుతం సుమారు 6 కోట్ల టన్నులకు పైగా స్టాక్ పేరుకుపోయింది. నిజానికి కేంద్రం నుంచి జీవో విడుదలైన తర్వాత 'రూపాయికి టన్ను చొప్పున బూడిద తీసుకెళ్లండి' అంటూ ఎన్టీపీసీ పలుసార్లు చెప్పినా.. ఆరంభంలో ఎవరూ పట్టించుకోలేదు. కానీ, ఒకవైపు మట్టి, ఇసుక కొరత ఏర్పడడం, మరోవైపు కేంద్రం బూడిదను ప్రోత్సహిస్తుండడంతో వినియోగం క్రమంగా పెరిగింది. మొదట్లో 2021 సెప్టెంబర్ వరకు బూడిదను ఉచితంగా తీసుకెళ్లేందుకు ఎన్టీపీసీ అనుమతించింది. ఆ తర్వాత పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని టెండర్లు పిలుస్తున్నది.

### రోజుకు 400 లారీలు

2021లో మొదటిసారిగా బూడిద తరలింపునకు ఎన్టీపీసీ టెండర్లు ఆహ్వానించింది. అప్పుడు టన్నుకు ₹400 చొప్పున తీసుకునేందుకు టెండర్ దాఖలైంది. అయితే సదరు వ్యక్తి రేటు ఎక్కువగా కోట్ చేయడంతో కొన్నాళ్లపాటు కొంత మంది వ్యక్తులు ఒక మాఫియాగా మారి.. ఆనాడు వక్రమార్గంలో బూడిదను వివిధ దారుల్లో తరలించారన్న విమర్శలు వచ్చాయి. తిరిగి 2023 జూన్‌లో మళ్లీ ఎన్టీపీసీ టెండర్లు నిర్వహించగా, 25 లక్షల టన్నుల బూడిదను తీసుకెళ్లేందుకు 28మంది కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. ఒక్కో టన్నుకు ₹40 చొప్పున టెండర్ దాఖలు చేశారు. ఆ మేరకు ఎన్టీపీసీ ఒకే చేయగా, అందులో ఉమ్మడి జిల్లాలోని సుమారు 200 ఇటుక బట్టీలకు ఏడాదిలో 4.50 లక్షల టన్నులు తీసుకెళ్లేందుకు సదరు బ్రిక్స్ కంపెనీ చెందిన వారు అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని టెండర్లు తీసుకున్నారు. అందులో భాగంగా రోజుకు 200 లారీల బూడిదను తీసుకెళ్లి వినియోగిస్తున్నారు. వీరితోపాటు జాతీయ రహదారులకు రోజుకు 100 లారీలు, అలాగే సింగరేణికి 100 లారీల చొప్పున వెళ్తున్నది. వీటితో పాటు స్లాబ్‌ల నిర్మాణాల నిమిత్తం ఆర్‌ఎంసీ వాళ్లు సైతం బూడిదను ఇక్కడి నుంచి తెచ్చుకుంటున్నారు.

### ఆగిపోయిన తరలింపు

నిత్యం బూడిదను తీసుకెళ్లే లారీలు ఈ నెల 18 నుంచి ఆగిపోయాయి. కొంత మంది వ్యక్తులు బూడిదను తరలించకుండా అడ్డుపడుతున్నారు. బూడిద తెచ్చేందుకు వెళ్లిన లారీల టైర్లలో గాలి తీసేసి డ్రైవర్లపై చేయి చేసుకున్నట్టు తెలుస్తున్నది. టెండర్ ఎవరూ తీసుకున్న ఫరవాలేదు గానీ, పాండ్ వద్ద బూడిద ఎత్తి లారీల్లో నింపడంతోపాటు వివిధ ప్రాంతాలకు చేరేవేసే అవకాశం స్థానిక ట్రాన్స్‌పోర్టుదారులకే ఇవ్వాలని కొంత మంది ఆందోళన చేస్తున్నారు. అయితే స్థానికంగా ఉపాధి కావాలని కోరుకోవడం తప్పు లేదు గానీ, ప్రస్తుతం టెండర్ నిబంధనలకు లోబడి నడుస్తున్న లారీలను అడ్డుకోవడం ఎంత వరకు సముచితమని టెండర్‌దారులు ప్రశ్నిస్తున్నారు. ఈ డిమాండ్‌ను ప్రభుత్వం లేదా ఎన్టీపీసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, కొంతమంది స్థానిక ట్రాన్స్‌పోర్టును చూపుతూ.. తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకునేందుకు ప్లాన్ చేశారన్న అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. అలాగే మాఫియాగా మారి బూడిద తరలింపును తమ చేతుల్లోకి తీసుకునేందుకు కుట్రలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ తతంగానికి కొంత మంది అధికార పార్టీ నాయకులు కూడా సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారి సహకారం లేకుంటే.. వందలాది లారీలను ఆపే ధైర్యం ఎక్కడి నుంచి వస్తుందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత టెండర్ గడువు 2024 జూన్ చివరి వరకు ఉన్నదని, ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు ఉంటే.. కొత్త టెండర్లు పిలిచే సమయంలో చూసుకోవాలే తప్ప.. ఇలా నిబంధనల ప్రకారం నడుస్తున్న లారీలను ఆపడం సరికాదని పలువురు టెండర్ దారులు స్పష్టం చేస్తున్నారు. దీని వెనుక పెద్ద వ్యవహారమే ఉందని అనుమానిస్తున్నారు.

### కాంట్రాక్టర్లలో ఆందోళన

నిజానికి ఒక లారీలో 26 టన్నులు బూడిద పడుతుంది. ఈ లెక్కన అన్నీ కలిపి ఎన్టీపీసీకి ఒక లారీకి ₹1100 చెల్లిస్తారు. అలాగే లోడింగ్‌కు ₹1400 తీసుకుంటున్నారు. ప్రస్తుతం టెండర్‌దారులు అనుసరిస్తున్న పాలసీ ఇది. అయితే ఈ వ్యవస్థను మొత్తం తమ చేతుల్లోకి తీసుకొని, ఒక్కో లారీపై వేలాది రూపాయలు వసూలు చేసేందుకు కొంతమంది ఒక మాఫియాగా ఏర్పడి ప్లాన్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అందులో భాగగానే బూడిదను తరలించకుండా అడ్డు పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కాగా, టెండర్ నిబంధనల ప్రకారం.. ఒకవేళ పాండ్ నుంచి బూడిదను సదరు టెండర్‌దారుడు ఇన్‌టైంలో తరలించక పోతే.. ఎన్టీపీసీ సదరు కాంట్రాక్టర్‌కు ఫైన్ విధిస్తుంది. ఇప్పటికే ఒక కాంట్రాక్టర్‌కు ₹18 లక్షలు, మరో కాంట్రాక్టర్ ₹9 లక్షల ఫైన్ విధించినట్టు తెలుస్తున్నది. ఈ పరిస్థితుల్లో లారీలను నిలిపివేస్తే నిర్ణీత లక్ష్యం మేరకు బూడి ద తరలించలేని పరిస్థితి ఏర్పడుతుందని, అదే జరిగితే తాము చేయని తప్పుకు ఫైన్ చెల్లించాల్సి వస్తుందని ప్రస్తుత కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బ్రిక్ ఇండస్ట్రీ వారు ఆవేదన చెందుతున్నారు.

### నిల్వలు పేరుకుపోతే ప్రమాదమే

4.50 లక్షల టన్నుల బూడిద తీసుకునేందుకు బ్రిక్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ వారు టెండర్ దాఖలు చేసినప్పటికీ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోపాటు హైదరాబాద్ కలిపి ఇటుక బట్టీలకు ఏటా 15 లక్షల టన్నుల వరకు బూడిద వాడుతున్నారు. బ్రిక్స్ పరిశ్రమపై ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా లక్ష, పరోక్షంగా దాదాపు రెండు లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో బూడిద తరలింపును అడ్డుకుంటే.. ఇటుక బట్టీల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదమున్నది. ఒకవేళ మాఫియా చెప్పినట్టు అధిక ధరకు బూడిద కొనుగోలు చేస్తే.. ఇటుక బట్టీల నిర్వాహకులు కూడా ధరలు పెంచే ఆస్కారమున్నది. దీని ప్రభావం సామాన్యులపై పడుతుంది. దీంతోపాటు జాతీయ రహదారుల పనులు కూడా నిలిచిపోయే ప్రమాదమున్నది. ఇటు బూడిద తరలింపునకు అడ్డు పడితే.. పాండ్‌లో నిల్వలు భారీగా పేరుకుపోయి ఏకంగా ఎన్టీపీసీ మూత పడే ముప్పు ఉంటుంది. అలాగే చుట్టు పక్కల గ్రామాలు ముఖ్యంగా కుందనపల్లిలో పర్యావరణం దెబ్బతినే ప్రమాదముంటుంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా వందలాది లారీలను నిలిపివేసినా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో ఇటువంటి పరిస్థితి ఎదురైనప్పుడు దగ్గరుండి సమస్యను పరిష్కరించిన పోలీసులు, ఈ సారి మాత్రం ఉదాసీనత వహించడం చూస్తే సదరు పోలీస్ అధికారులపై ఎవరైనా ఒత్తిడి చేస్తున్నారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ సమస్యకు పరిష్కారం చూపించాలన్న డిమాండ్ వ్యక్తమవుతున్నది.

# అంతా రామమయం



కరీంనగర్‌లోని సప్తగిరి రామాలయంలో భక్తులు



నర్సింగాపూర్‌లోని రామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

- అయోధ్య రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠతో ఉమ్మడి జిల్లాకు ఆధ్యాత్మిక శోభ
- జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ఎల్‌ఈడీ స్క్రీన్లలో రామకార్యాన్ని వీక్షించిన భక్తులు



నగరంలో అయోధ్య ఆలయ నమూనా వద్ద సెల్ఫీ దిగుతున్న యువతులు

పెద్దపల్లి , జనవరి 22 (నమస్తే తెలంగాణ): అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రామనామ స్మరణతో మార్మోగాయి. ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక పూజలు, యజ్ఞయాగాదులు, భజన కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులతో కిటకిటలాడాయి. కాగా, ఆలయాలపై, ప్రతి ఇంటిపైనా, రహదారులపై శ్రీరాముని జెండాలు, తోరణాలు కట్టారు. ఇంటి ప్రధాన ద్వారాల ముందు అయోధ్య ఆలయం, జైశ్రీరాం ముగ్గులు వేశారు. వాడవాడలా అన్న ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయాల్లోనే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, రామ భక్తులు తమ వార్డుల్లో అన్నదానం చేపట్టారు. శ్రీరాముడి పల్లకీ సేవలు, శోభాయాత్రలు నిర్వహించారు. సాయంత్రం అందరు తమ ఇళ్లల్లో జ్యోతులు వెలిగించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను తలపై చల్లుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు రాజకీయాలకతీతంగా రామ కార్యంలో పాల్గొన్నారు. ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి భక్తులు వందలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్లలో ప్రాణప్రతిష్ఠను వీక్షించారు. ఆయాచోట్ల వేడుకల్లో ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు. వేములవాడ, రుద్రంగిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, హుజూరాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించగా, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, శాలిని దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. కాల్వశ్రీరాంపూర్ మండలం లక్ష్మీపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు హాజరై పూజలు చేశారు.



కరీంనగర్‌లోని సప్తగిరి రామాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు

### ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**- మాజీ ఎంపీ వినోద్**

బోయినపల్లి, జనవరి 22: శ్రీరాముడి కరుణ కటాక్షాలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆకాంక్షించారు. సోమవారం బోయినల్లి మండలం నర్సింగాపూర్‌లోని శ్రీ సీతారామచంద్రాస్వామి ఆలయంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రామమందిరం నిర్మించడం గొప్ప పరిణామం అన్నారు. మానవజాతిలో పురుషుడు ఎలా ప్రవర్తించాలో అని చెప్పడానికి రాముడు నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్‌రావు, జోగినపల్లి అజిత్ కుమార్, ఆదిత్య, సంపత్‌రావు, మాజీ సర్పంచ్ లక్ష్మీరాజం, ఉపసర్పంచ్ కావేరి, జితేందర్‌రావు, ప్రకాశ్‌రావు, కిషన్‌రావు పాల్గొన్నారు.



బోర్డు తీసేసిన అనంతరం గెస్ట్‌హౌస్

# అభివృద్ధిపైనా కక్షసాధింపా..?

- కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ బోర్డు తొలగింపు
- స్పష్టత ఇవ్వని అధికారులు
- పేరులో కేసీఆర్ రావడమే కారణమా..?
- బీఆర్‌ఎస్ శ్రేణుల మండిపాటు
- వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 22: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నడిబొడ్డున అద్భుతంగా నిర్మించిన 'కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్' బోర్డును సోమవారం తొలగించారు. దశాబ్దాల కింద నిర్మించిన కరీంనగర్ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో కేసీఆర్ ప్రభుత్వం ₹7.50 కోట్లు వెచ్చించి జీ ప్లస్ వన్ పద్ధతిలో సకల హంగులతో ఆధునిక భవనాన్ని నిర్మించింది. దీనికి కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్‌గా పేరు పెట్టింది. గతేడాదే దీనిని అప్పటి మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న గెస్ట్ హౌస్‌ల్లో ఇది అద్భుతంగా ఉండడంతో అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే తాజాగా ఈ గెస్ట్ హౌస్ నేమ్ బోర్డును తొలగించడంపై బీఆర్‌ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఎవరు తొలగించారనేది..? ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా స్పష్టత ఇవ్వడం లేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితోనే కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్‌తో ఉన్న బోర్డును తొలగించిందన్న విమర్శలు వస్తున్నాయి. మరో పక్క జరిగిన ఘటనపై బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులపైనే ఆరోపణలు సంధిస్తున్నారు. కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ పేరులో కేసీఆర్ అనే పదం వస్తున్నదన్న అక్కసుతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పేరు తొలగించదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### నేమ్ బోర్డు తొలగించడం బాధాకరం

కరీంనగర్ జిల్లాకే తలమానికంగా మారిన కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ బోర్డును ఎవరు తొలగించారో..? ఎందుకు తొలగించారో..? నగర ప్రజలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉన్నది. గతంలో చాలా పార్టీలకు చెందిన వ్యక్తులు కరీంనగర్ పేరును మార్చాలని ప్రగల్భాలు పలికారు. ఇది వాళ్ల పనేనా..? అని అనుమానం వస్తున్నది. ఏదేమైనా బోర్డును తిరిగి యథావిధిగా ఏర్పాటు చేయాలి.

**- ఒక ప్రకటనలో కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు**

### ఇది మంత్రి పొన్నం పనే : జీవీఆర్

కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్ పేరిట ఉన్న బోర్డు తొలగింపు పని మంత్రి పొన్నం ప్రభాకర్‌దేనని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో ఆరోపించారు. కరీంనగర్ పేరును గొప్పగా చెప్పుకునేలా ఆధునిక హంగులతో భవనాన్ని నిర్మించి కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ అని పేరు పెడితే, దీనిని తొలగించి మంత్రి పొన్నం ఆర్‌అండ్‌బీగా మార్చుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈఈ అతిథి గృహానికి కరీంనగర్ పేరు ఉండడం పొన్నం ప్రభాకర్‌కు ఇష్టం లేదా..? కరీంనగర్‌కి గొప్ప పేరు రావడం నచ్చడం లేదా..? చెప్పాలని ప్రశ్నించారు. కరీంనగర్ అనే పదంపై పొన్నంకు ఎందుకంత కోపమో..? చెప్పాలని, ఇక్కడి ప్రజలు ఆయన్ను మూడుసార్లు ఓడించారనే ఆక్రోశమా..? లేక ఆ పేరులో కేసీఆర్ కనిపిస్తున్నారనే ఆందోళనతోనా..? చెప్పాలని ప్రశ్నించారు. గతంలో కరీంనగర్ పేరు మార్చాలని బీజేపీ నాయకులు మాట్లాడారని, ఇప్పుడు ఆ రెండు పార్టీలు ఒక్కటై కరీంనగర్ పేరు ఎక్కడా కనిపించకుండా చేస్తున్నాయని విమర్శించారు.